ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగ పడుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌కు చెందిన సుధీర్‌కు మంజూరైన రూ. 1.70 లక్షల ఎల్ఓసీ చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య సంరక్షణకు సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీల సమస్యలను పరిష్కరించాలని డివిజన్ పరిధిలోని పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం జీహెచ్ఎంసీ తూర్పు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాలనీలలో డ్రైనేజీ, పార్కులు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని జెడ్సీని కోరారు.

నియామకం

మన్సూరాబాద్: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన డాక్టర్ వీరభోగ వసంతరాయలును నియమిస్తూ అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వసంతరాయలు మాట్లాడుతూ.. బీసీ సమాజాన్ని అన్ని రంగాల్లో ఎదిగేలా బీసీ ఫెడరేషణ్ కులాల సమితి కార్యాచరణ ఉంటుందన్నారు.

సుధీర్‌కుమార్ యువతకు ఆదర్శం



సుధీర్‌కుమార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

చంపాపేట: మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే పంజాల సుధీర్‌కుమార్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఈవూరి బద్రీనాథ్ అన్నారు. సుధీర్‌కుమార్ వర్ధంతి సందర్భంగా సోమవారం చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోయలకొండ సునీల్ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై సుధీర్‌కుమార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల వెంకటరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సమర్పించిన వారిపై ఫిర్యాదు

చాదర్‌ఘాట్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వ్యక్తులపై చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మలక్‌పేట సర్కిల్–6 ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం పిల్లిగుడిసెలు ప్రాంతానికి చెందిన పశువుల ఆంజనేయులు, పశువుల నాగలక్ష్మి దంపతులు తమ కుమారుడి బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం వెళ్లగా ఆ పిల్లవాడు కర్నూల్ జిల్లాలో జన్మించినట్లు తెలిసింది. స్థానికంగానే జన్మించినట్లు తప్పుడు పత్రాలు సమర్పించారు. దంపతులిద్దరితో పాటు సాక్షులు, నోటరీ చేసిన వ్యక్తులపై కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

నిధులున్నా.. పనులు సున్నా

శాఖల నడుమ సమన్వయ లోపంతో ముందుకు కదలని డ్రైనేజీ లైన్ పనులు

- మూడేళ్ల క్రితం రూ.1.80 కోట్లు మంజూరు
- అవస్థలు పడుతున్నా కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు

ఎల్‌బీనగర్: శాఖల నడుమ సమన్వయ లోపం కాలనీ ప్రజలకు శాపంగా మారింది. కాళ్లకు చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగి తెచ్చుకున్న నిధుల నుంచి తట్టెడు మట్టిని కూడా తీయలేకపోయారు. దీంతో కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక నరకయాతన పడుతున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందావన్ మెడోస్‌కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీల నుంచి కిందికి వర్షం నీరు వెళ్లడానికి రాచకాలువ ఉండేది. ఆ రాచకాలువను కొందరు అక్రమించి దానిపై నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రాచకాలువ నుంచి ఈ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేస్తే పక్కన ఉన్న భూముల యజమానులకు ఇబ్బందులు ఉండవు. కానీ రాచకాలువ ఆక్రమించుకోవడంతోనే ఈ కాలనీకి వచ్చిన పెద్ద ముప్పు అని తెలుస్తోంది. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్‌గా కాలువను పరిశీలించి కాలనీ వాసులకు, డ్రైనేజీ నిర్మాణం చేసేందుకు ఎన్ఓసీ కూడా ఇచ్చారని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు ఇచ్చిన ఎన్ఓసీ ద్వారా కాలనీలో వాటర్ వర్క్స్ అధికారులు డ్రైనేజీ పనులు ప్రారంభించాల్సి ఉండగా నిర్లక్ష్య ధోరణితో పనులు ముందుకు సాగడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

రాజకీయ నాయకుల మోకాలడ్డు..

బృందావన్ మెడోస్ కాలనీకి భూగర్భ డ్రైనేజీ కోసం 2023లో సుమారుగా రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు చేయపోకవడంతో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ ఇంటి ముందు తీసిన డ్రైనేజీ గుంతలు నిండిపోవడం వాటిని శుభ్రం చేయించుకోవాలంటే సుమారుగా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రతి ఇంటి యజమానికి అదనంగా ఖర్చు భరించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ కాలనీలో సుమారుగా 100 ఇళ్లు ఉంటుండగా ఇంటి యజమానులతో పాటు అద్దెకుండే వారు సుమారుగా 600పైగా కాలనీలో జనసందోహం ఉంటారు. డ్రైనేజీ కోసం మంజూరైన నిధులతో 300ఎంఎం డయాతో 857 మీటర్ల వరకు ఈ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనుల చేపట్టాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం తాము తెచ్చుకున్న నిధులను ఖర్చు చేయడంలో విఫలం చెందారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల మాటలు విని తమ కాలనీలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీకి మంజూరైన డ్రైనేజీ నిధులతో త్వరగా పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రైనేజీ పనుల కోసం తవ్వి వదిలేసిన గుంతలు



బృందావన్ మెడోస్ కాలనీ

అధికారుల నిర్లక్ష్యమే..



మా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేయించుకున్నాం. అప్పటి నుంచి అధికారులు నేటి వరకు పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు పనులు వర్షాకాలం వచ్చే లోపు పనులు పూర్తి చేయించాలి.

– శశికాంత్, బృందావన్ మెడోస్‌కాలనీ అధ్యక్షులు

మూడు నెలల బియ్యం సరఫరాకు ఏర్పాట్లు

ఎల్‌బీనగర్: వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల నుంచి ఆగస్టు నెల వరకు ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యంను సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సరూర్‌నగర్ సహాయ పౌర సరఫరా అధికారి పుల్లయ్య తెలిపారు. గోడౌన్ల నుంచి రేషన్ సరఫరా పాయింట్లకు చేర్చేందుకు అన్నిన చర్యలు తీసుకున్నామని వచ్చే నెల నుంచి బియ్యం సరఫరా ప్రారంభం అవుతోందన్నారు. సర్కిల్ పరిధిలో సుమారుగా 2,10,022 రేషన్ కార్డులు ఉండటంతో 13,456.23 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని చెప్పారు. అందరికి బియ్యం అందేలా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో సర్వేనెంబర్ 58లో ప్రభుత్వ భూమిలో కొంత మంది నిర్మాణాలు చేపట్టడంతో సమాచారం అందుకున్న అధికారులు సోమవారం సదరు నిర్మాణాలను కూల్చివేశారు. సర్వే నెంబర్ 58లో ప్రభుత్వ భూమిలో ప్రభుత్వం నాగోలు పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి, క్రీడా మైదానం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించారు. ప్రభుత్వం నిధులు రాకపోవడంతో అక్కడ ఎలాంటి ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టకపోవడంతో స్థానికులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి అక్బర్ ఆధ్వర్యంలో సోమవారం సదరు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.

స్టామ్ వాటర్ పైప్‌లైన్ పరిశీలన



స్టామ్ వాటర్ పైప్‌లైన్ సమస్యలు జెడ్సీకి వివరిస్తున్న కార్పొరేటర్లు

నాగోలు: ఎల్‌బీనగర్ నుంచి అల్కాపురి చౌరస్తాకు నిర్మాణం చేసే స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్‌ను సోమవారం జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆర్‌కేపురం డివిజన్ మీదుగా ఎల్‌బీనగర్ నుంచి అల్కాపురి జంక్షన్ వరకు వేస్తున్న పైపులైన్ సమస్యను పరిశీలించారు. మూసీ వరకు సరైన అవుట్ లెట్ లైన్ లేదని జోనల్ అల్కాపురి జంక్షన్ నుంచి మూసీ వరకు పైపులైన్ కలపాలని కార్పొరేటర్లు జోనల్ కమిషనర్‌కు వివరించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు పై నుంచి వచ్చే వరద నీటితో న్యూ నాగోల్, సమితపురి కాలనీ నీట మునుగుతుందన్నారు. స్ట్రాం వాటర్ పైప్‌లైన్ అవుట్ లెట్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మూసీ వరకు అయ్యే అవుట్‌లెట్ అంచనాలను వేయిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మండల వ్యవసాయాధికారి నాగమణి

మహేశ్వరం: ఎరువుల దుకాణాదారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి నాగమణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం, మన్సాన్‌పల్లి చౌరస్తా, అమీర్‌పేట్ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను మహేశ్వరం సీఐ, ఎస్ఐలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎరువుల దుకాణాదారులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దుకాణాదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు కింద కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అంతకుముందు ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేసి రికార్డులు, రశీదులు, విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రసాద్, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి నాగమణి, సీఐ వెంకటేశ్వర్లు

సీసీ కెమెరాలు ప్రారంభం

నాగోలు: కాలనీలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. కొత్తపేట డివిజన్ న్యూ మారుతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన 56 సీసీ కెమెరాలను సోమవారం ఆయన కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా తో కలిసి ప్రారంభిచారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి ఎస్సై భద్రయ్య, న్యూమారుతినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నిరంకి రవి, అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, రవి కేశవ్, మహేష్, శ్రీనివాస్, మురళి కృష్ణ, అంజనేలు, శంకర్, అరుణకుమార్, సంతోష్, శంకర్‌రెడ్డి, రాంచందర్, ఉపేందర్, ఆశీష్‌రావు, సదానంద్, అంజి, సత్తయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.17, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.33, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.50

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చాయని జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్ తెలిపారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగంలో 7, మిగతా విభాగంలో 5 ఫిర్యాదులు వచ్చాయి. ఉప్పల్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదులు 2, ఎల్‌బీనగర్ సర్కిల్–3లో టౌన్ ప్లానింగ్‌లో 4 , ఎల్‌బీనగర్ సర్కిల్–4లో ఫిర్యాదులు వచ్చాయన్నారు.

వచన కవిత పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

మన్సూరాబాద్: చిమ్మపూడి ఫౌండేషన్ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో పదవ తరగతి ఆ పైన తరగతుల విద్యార్థులకు రాష్ట్రస్థాయి వచన కవితల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు చిమ్మపూడి శ్రీరామమూర్తి తెలిపారు. విజేతలకు రూ.5వేల నగదు పారితోషికం అందజేస్తామని జూన్ 10వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వేయని రోడ్డుపై విచారణ షురూ

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై రహదారి బిల్లులను అక్రమంగా పొందిన అధికారులపై విచారణ మొదలైంది. సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద గత గణేష్ నిమజ్జన ఉత్సవాల సమయంలో వేయాల్సిన రహదారిని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై రికార్డుల్లో వేసినట్లు తప్పుడుగా నమోదు చేసి సుమారు రూ. 10లక్షలు తమ జేబుల్లోకి మళ్లించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయటంతో వారి అవినీతి వెలుగులోకి వచ్చింది. సదరు ఘటనపై ఉన్నతాధికారులు విచారణ మొదలు పెట్టారు. ఐఎస్‌సదన్‌లో రహదారి అవినీతి విషయమై సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారును వివరణ కోరగా, కార్పొరేటర్ ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని ఫిర్యాదులోని అంశాలపై సమగ్ర విచారణ చేసి రెండు రోజుల్లో జోనల్ కమిషనర్‌కు అందజేస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ కృషినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా నరేష్‌కుమార్, కార్యదర్శిగా సహదేవ్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా రామిరెడ్డి, కౌశిక్, జనార్దన్‌రెడ్డి, గంగాభవాని, కోశాధికారిగా వెంకటరెడ్డి, సహాయ కోశాధికారిగా రాజేంద్ర, కార్యనిర్వాహక సభ్యులుగా రాములు, మల్లేష్, మునీశ్వర్, మురళి, పుల్లయ్య, రాజశేఖర్‌రెడ్డి, నిరోషా, ఆడిటర్‌లుగా కృష్ణారావు, సుబ్రహ్మణం, గౌరవ అధ్యక్షులు సాంబశివరావు, గౌరవ సలహాదారులు సత్యనారాయణగౌడ్, రమణరావును ఎన్నుకున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ అన్నారు. సోమవారం కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ప్రజలు సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.25 లక్షల చెక్కును అక్బర్‌బాగ్‌కు చెందిన పారపల్లి భారతికి అందజేశారు.



చెక్కు అందజేస్తున్న షేక్ అక్బర్

సైదాబాద్ ఏసీపీగా వెంకట్‌రెడ్డి



సోమ వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్

సైదాబాద్: సైదాబాద్ నూతన ఏసీపీగా సోమ వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఎస్‌డీపీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన సైదాబాద్‌కు వచ్చారు. ఇక్కడ పని చేసిన వెంకన్న నాయక్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన సోమ వెంకట్‌రెడ్డిని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, పలువురు ఎస్సైలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

నిరుపేద వివాహానికి ఆర్థికసాయం



వధువు తల్లికి నగదు అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ తనవంతుగా సహాయ, సహకారాలను అందిస్తానని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు రాచులూరు మల్లయ్య కుమార్తె వివాహానికి రూ.25వేల ఆర్థికసాయం అందించాడు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు ఎనుగుల రాములు, విష్ణు, మంచాల రాజు, ఎండీ.మహబూబ్, బూడిద శ్రీనివాస్‌గౌడ్, ఎనుగుల రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫౌంటెయిన్.. నిర్వహణ మరిచెన్

నగర సుందరీకరణలో భాగంగా నల్లగొండ చౌరస్తా వద్ద దాదాపు రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ నిరుపయోగంగా మారింది. ప్రారంభంలో బాగానే ఉన్నా ఆ తర్వాత దాని నిర్వహణ మరవడంతో కళావిహీనంగా మారుతోంది. ప్రారంభంలో ఈ ఫౌంటెయిన్ ఆకర్షించడమే కాకుండా సాయంత్రం చిన్నారులు అక్కడ ఆడుకునే వారు. అధికారులు స్పందించి ఫౌంటెయిన్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

– చాదర్‌ఘాట్



చెట్టు.. కూలేటట్టు?

దిల్‌సుఖ్‌నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ చెట్టు ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఈ చెట్టు పక్కనే ఉన్న మరో చెట్టు అకస్మాతుగా కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.ఈ చెట్టు కూడా ఓ వైపునకు ఒరిగింది. చెట్టు కిందే చిరువ్యాపారుల డబ్బాలు, ఆటోలు, బైక్‌లు పార్కింగ్ చేస్తారు. గాలి వీస్తే కూలే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు స్పందించి పెద్ద ప్రమాదం జరగక ముందే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–మలక్‌పేట



పేరుకుపోతున్న చెత్త.. తరలించేదెప్పుడంటా?

పచ్చని చెట్లు ఒక వైపు..ఫ్లైఓవరు అంతర్గత మార్గం మరో వైపు. దానికి ఆనుకొని జాతీయ వికలాంగుల పార్కు ఇంకో వైపు. గత వారం రోజుల నుంచి ఆ ప్రాంతమంతా చెత్తకుప్పలతో దుర్వాసన వస్తోంది. సాయంత్రం వందల సంఖ్యలో జాతీయ పార్కుకు వస్తుంటారు. చెత్త లోంచి వచ్చే దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని పేరుకుపోయిన చెత్తను వెంటనే తరలించాలని సందర్శకులు కోరుతున్నారు.

– చాదర్‌ఘాట్

